సాక్షి అనకాపల్లి

ఆదివారం । 20 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల విక్రయం



ఆర్‌ఈసీఎస్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల విక్రయం ప్రారంభం

కశింకోట: ఇక్కడి ఆర్‌ఈసీఎస్ కార్యాలయంలో ఉన్న రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యుత్ వినియోగదారులు, ఉద్యోగుల కోటా కింద 50 శాతం సీట్ల భర్తీకి దరఖాస్తుల విక్రయం శనివారం ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ కె.శివ మాట్లాడుతూ కళాశాలలో సివిల్, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ బ్రాంచ్‌లున్నాయని చెప్పారు. వాటిలో ఒక్కొక్క బ్రాంచ్‌లో 30 వంతున విద్యుత్ వినియోగదారులు, ఉద్యోగుల కోటా కింద సీట్లు ఉన్నాయన్నారు. వీటికి కశింకోట, మునగపాక, అనకాపల్లి రూరల్, సబ్బవరం, పరవాడ మండలాలు, అగనంపూడి తదితర ప్రాంతాలకు చెందిన వారు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పాలిసెట్‌లో వచ్చిన ర్యాంకు, రిజర్వేషన్ ఆధారంగా ప్రాధాన్యతా క్రమంలో సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఇంకా వివరాలకు 9505504220, 7207905646, 7207905645, 9063297220 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు గణేష్, పి.రమణకుమార్, కె.శివరాం, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటన



అనకాపల్లి జోనల్ కార్యాలయం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటించింది. శుక్రవారం ఇక్కడికి వచ్చిన ఇద్దరు సభ్యులు 81, 82 వార్డుల్లో కొన్ని ప్రాంతాల్లో పర్యటించారు. అయితే ఆన్‌లైన్ సరిగా పనిచేయకపోవడంతో పర్యటనను మధ్యలో నిలిపివేసి విశాఖకు వెళ్లిపోయారు. శనివారం 83, 84 వార్డుల్లో పర్యటించారు. ప్రజామరుగుదొడ్లు, పారిశుధ్యం, డ్రైనేజీ, ప్లాస్టిక్ వినియోగం, రహదారులపై చెత్తాచెదారం వంటి వాటిని పరిశీలించారు. బృందం సభ్యులు దీనిపై నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేసిన అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ ప్రకటిస్తారు. జోన్ పరిధిలో వాటర్ విభాగంలో పలు అంశాలను పరిశీలించేందుకు వచ్చేనెల మొదటి వారంలో బృందం సభ్యులు మరోసారి అనకాపల్లి పర్యటనకు రానున్నట్టు స్థానిక పారిశుధ్య విభాగం అధికారులు తెలిపారు.

హాకీలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలి

- గోల్‌కీపర్ శైలజకు ఘన సన్మానం



హాకీ క్రీడాకారిణి శైలజను పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానిస్తున్న గ్రామస్థులు

కె.కోటపాడు : జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనేందుకు ఎ.భీమవరానికి చెందిన తర్రా శైలజ ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని వైఎస్సార్‌సీపీ నాయకుడు తర్రా శేషు అన్నారు. జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణకు ఎంపికైన శైలజను ఆ గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించి, ఆర్థికసాయం అందించారు. హాకీపోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలని శేషుతో పాటు గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో డి.వి.డి.ప్రసాద్, సర్పంచ్ తర్రా సన్యాసమ్మ, పాఠశాల విద్యాకమిటీ వైస్ చైర్మన్ తర్రా మోహన్‌రావు, లక్ష్మణరావు, మురళీకృష్ణ, చందు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు తాడి శ్రీనివాసరావు, తర్రా నారాయణరావు, ఉగ్గిన త్రినాథ్, హెచ్‌ఎం సూర్రెడ్డి శ్రీనివాసరావు, సూర్రెడ్డి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం నాలుగో వార్డులో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధుడు

ఉప ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ హవా!

- సర్పంచ్‌లు, వార్డు సభ్యుల్లో అధికార పార్టీ మద్దతుదార్ల సత్తా
- టీడీపీ, జనసేన, బీజేపీలు ఏకమైనా తప్పని ఓటమి



మునగపాక మండలం మెలిపాకలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వేచి ఉన్న ఓటర్లు

సాక్షి, విశాఖపట్నం: పంచాయతీలు, వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చాటింది. ఇటు సర్పంచ్ స్థానాలు, అటు వార్డు సభ్యుల స్థానాల్లోనూ ఆ పార్టీ హవా కొనసాగింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏడు సర్పంచ్, 93 వార్డు మెంబర్ స్థానాలకు నోటిఫికేషన్ జారీ అయింది. వీటిలో ఏకగ్రీవమైన స్థానాలు మినహా మిగిలిన వాటికి శనివారం ఎన్నికలు జరిగాయి. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం అధికారులు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించారు. విశాఖపట్నం జిల్లాలో ఒక సర్పంచ్, తొమ్మిది వార్డులు, అనకాపల్లి జిల్లాలో రెండు సర్పంచ్, 26 వార్డులు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో నాలుగు సర్పంచ్, 57 వార్డులకు నోటిఫికేషన్ ఇచ్చారు. మొత్తం ఏడు సర్పంచ్ స్థానాల్లో నాలుగు చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, మూడు చోట్ల టీడీపీ బలపరచిన అభ్యర్థులు గెలుపొందారు. వీరిలో విశాఖ జిల్లా భీమిలి మండలం లక్ష్మీపురంలో లచ్చిబుగత జగదీశ్వరరావు (వైఎస్సార్‌సీపీ మద్దతుదారు)ను ఇదివరకే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గతంలో ఆయన తండ్రి సర్పంచ్‌గా ఉంటూ చనిపోవడంతో జగదీశ్వరరావుపై ఇతర పార్టీలు పోటీ పెట్టలేదు. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట సర్పంచ్ మరణించడంతో ఆయన భార్య సుంకర లక్ష్మి (టీడీపీ)పై సానుభూతితో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిని బరిలో దించలేదు. దీంతో ఆ స్థానం ఏకగ్రీవమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం ఆకూరు మహిళా సర్పంచ్ మరణించడంతో ఆ స్థానానికి ఎన్నిక లేకుండా ఆమె ఆడపడుచు వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కత్తుల సరస్వతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా అల్లూరి జిల్లాలో సీలేరుకు వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు పాంగి దుర్గో, పెదకోడపల్లికి బట్టి చిట్టిబాబులు, శోభకోటకు టీడీపీ మద్దతుదారు శోభిభూషణ్‌నాయుడులు, అనకాపల్లి జిల్లా కొరుప్రోలుకు కర్రి సూరివేణి (టీడీపీ మద్దతుదారు) సర్పంచ్‌లుగా గెలుపొందారు.

వార్డు స్థానాల్లోనూ అదే జోరు..

మరోవైపు వార్డు స్థానాల ఫలితాల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులే అత్యధిక సంఖ్యలో విజయం సాధించారు. విశాఖపట్నం జిల్లాలో తొమ్మిది వార్డు స్థానాల్లో ఏకగ్రీవమైన ఎనిమిదితో పాటు ఎన్నికలు జరిగిన పెందుర్తి మండలం గొరపల్లి స్థానం కూడా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే గెలుపొందారు. అనకాపల్లిలో మొత్తం 26 స్థానాల్లో రెండు స్థానాలకు ఎన్నికలు జరగలేదు. 20 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదార్లు (14 స్థానాలు ఏకగ్రీవం) నలుగురు (ఇద్దరు ఏకగ్రీవం) టీడీపీ బలపరచిన వారు గెలిచారు. ఇక అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 57 స్థానాల్లో 43 ఏకగ్రీవం కాగా, 14 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో వైఎస్సార్‌సీపీ 11, స్థానాలు టీడీపీ 2, ఒక స్థానంలో సీపీఐ(ఎం) బలపరచిన అభ్యర్థి విజయం సాధించారు.

విజేతలు వీరే..

మండలం	పంచాయతీ	పదవి	గెలుపొందిన అభ్యర్థి
ఎస్.రాయవరం	కొరుప్రోలు	సర్పంచ్	కె.సూరివేణి
అచ్యుతాపురం	దిబ్బపాలెం	4వ వార్డు	పి.ఉస్తాలు
గొలుగొండ	గాదంపాలెం	2వ వార్డు	టి.రాజేశ్వరి
మునగపాక	మెలిపాక	6వ వార్డు	జి.ఎ.వి.సత్యనారాయణ
నక్కపల్లి	చినదొడ్డిగల్లు	1వ వార్డు	నాయుడు నానాజీ
నర్సీపట్నం	మెట్టపాలెం	2వ వార్డు	పి.కొండబాబు
పరవాడ	కన్నూరు	7వ వార్డు	ఎం.అప్పారావు
పాయకరావుపేట	శ్రీరాంపురం	8వ వార్డు	ఎం.నూకరాజు
ఎస్.రాయవరం	లింగరాజుపాలెం	5వ వార్డు	జి.నాగనూక

ఆ మూడూ ఏకమైనా..

ఈ ఉప ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలు ఏకమైనా వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థుల విజయాన్ని ఆపలేకపోయాయి. పలుచోట్ల ఈ పార్టీల నాయకులు వార్డు స్థానాలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఓటుకు రూ.వేలతో ఓటర్లకు గాలం వేశారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ బలపరచిన వారికే జనం మెజార్టీ స్థానాలను కట్టబెట్టారు.

భారీగా బెట్టింగులు..

ఈ ఎన్నికల్లో జిల్లాలో భారీగా బెట్టింగులు జరిగాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులపై టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు రూ.వేలు, లక్షల్లో బెట్టింగులు కాశారు. ఉదాహరణకు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లులో ఒకటో వార్డు అభ్యర్థి గెలుపుపై ఆ గ్రామంలో రూ.45 లక్షల వరకు బెట్టింగులు జరిగినట్టు తెలిసింది. అక్కడ వైఎస్సార్‌సీపీ మద్దతుదారు నాయుడు నానాజీ చేతిలో టీడీపీ, బీజేపీ, జనసేనల ఉమ్మడి మద్దతుదారు ఒక్క ఓటు తేడాతో ఓటమి పాలయ్యారు.

రెండేళ్లకే నూరేళ్లు...

- బస్ ఢీకొని బాలుడి మృతి
- వేట జంగాలపాలెంలో విషాదం



సమర్పణ కుమార్ మృతదేహం

అనకాపల్లి టౌన్ : అభం శుభం తెలియని చిన్నారి బాలుడికి రెండేళ్లకే నూరేళ్లు నిండాయి..అన్న స్కూలుకు వెళ్లడానికి బస్ ఎక్కుతుంటే..వెనకనే వచ్చిన ముద్దులొలికే ఆ చిన్నారి ప్రమాదవశాత్తూ అదే బస్సు కింద పడి మరణించడం స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. వేటజంగాలపాలెం గ్రామంలో జరిగిన ఈ విషాద ఘటన వివరాలివి. గ్రామానికి చెందిన బెజవాడ దుర్గారావు, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సనీప్ అనకాపల్లి శ్రీ వైష్ణవి టెక్నో స్కూల్లో ఎల్‌కేజీ చదువుతున్నాడు. రెండున్నరేళ్ల వయసు గల రెండో కుమారుడు సమర్పణకుమార్ ఇంటి వద్ద తల్లిదండ్రులతో ఉంటున్నాడు. దుర్గారావు పెద్ద కుమారుడితో పాటు అతని అన్నయ్య కుమారులు ఇద్దరు అదే స్కూల్లో చదువుతున్నారు. ప్రతిరోజు లాగే.. ప్రైవేట్ స్కూల్ బస్ వేట జంగాలపాలెం నుంచి అనకాపల్లి వస్తున్న సమయంలో జ్యోతి ముగ్గురు పిల్లలను బస్ ఎక్కించి వస్తుండగా ఇంట్లో ఉన్న సమర్పణకుమార్ బస్ ముందుకు వచ్చి నిలబడ్డాడు. అయితే బాలుడిని గమనించని డ్రైవర్ పిల్లలు ఎక్కిన వెంటనే బస్‌ను ముందుకు పోనివ్వడంతో బస్ ముందున్న బాలుడిని ఢీకొట్టాడు. దీంతో ఆ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రెప్పపాటులో జరిగిన దుర్ఘటనతో ఆ తల్లిదండ్రులు భోరుమన్నారు. ముద్దులొలికించే తమ చిన్నారి ఇక లేడని తెలియడంతో వారి కుటుంబ సభ్యుల రోదన స్థానికులను కలచివేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. మృతుడి తండ్రి దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

అమ్మకు అండగా..

- స్పందించిన అధికారులు, నాయకులు
- సుఖప్రసవం అయ్యేలా చూస్తామని గర్భిణి కొండాజీకి భరోసా
- తక్షణ వైద్యసేవలు.. పళ్లు, పోషక పదార్థాలు అందజేత

సాక్షి ఎఫెక్ట్..

బుచ్చెయ్యపేట: నిరుపేద నిండు గర్భిణి బేర కొండాజీకి అండగా ఉండి ఆమెకు సుఖ ప్రసవం అయ్యేలా చూస్తామని వైద్యురాలు, ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. 'అమ్మను ఆదుకుందాం' శీర్షికన ప్రచురితమైన సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. శనివారం కొండాజీ ఇంటికి వైస్ ఎంపీపీ దొండా లలిత, వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు వెళ్లి ఆమెకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కొండాజీకి ఇంటి వద్దే రక్త పరీక్షలు నిర్వహించి 6 గ్రాముల రక్తం ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు స్థానిక అంగన్‌వాడీ -3 కేంద్రంలో ప్రతి రోజూ మధ్యాహ్నం పూట భోజనం పెడతామని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తామని చెప్పారు. మాడుగుల అంగన్‌వాడీ కేంద్రం నుంచి కాకుండా వడ్డాది అంగన్‌వాడీ కేంద్రంలో కొండాజీ పేరు నమోదు చేసి ఆమెకు పౌష్టికాహారం అందేలా చూస్తామన్నారు. కొండాజీ రక్తహీనతతో బాధపడుతుండడంతో హెచ్‌బీ పెరగడానికి ఇంజక్షన్లు, మందులు అందిస్తామన్నారు. కొండాజీకి సుఖ ప్రసవం అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ ఎంపీపీ దొండా లలిత, వైఎస్సార్‌సీపీ నాయకుడు దొండా నారాయణమూర్తి కొండాజీకి పళ్లు, పోషక పదార్థాలు అందించారు. బాధితురాలికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు, పౌష్టికాహారం అందించాలని వైస్ ఎంపీపీ అధికారులకు సూచించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లి ఆమెకు మెరుగైన వైద్య సేవలు, పోషణ జరిగేలా చూస్తామన్నారు. ఏఎన్‌ఎం సాయిలక్ష్మి, ఆశ వర్కర్ వరలక్ష్మి, వార్డు మెంబర్లు బేరా పార్వతి, బొబ్బరి ఈశ్వరరావు, గ్రామ వలంటీర్లు తదితర్లు పాల్గొన్నారు.



కొండాజీకి పళ్లు, పౌష్టికాహార పదార్థాలు అందిస్తున్న వైద్యాధికారి, నాయకులు

అణుకులో ప్రభుత్వ పాఠశాల ప్రారంభం

కోటవురట్ల: ఎట్టకేలకు అణుకు ప్రజల కోరిక నెరవేరింది. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభమయింది. గొట్టివాడ పంచాయతీ శివారు అణుకు గిరిజన గ్రామానికి రోడ్డు వేయాలని, గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతూ గిరిజనులు గత 44 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఎస్‌ఆర్‌ఎస్‌టీ ద్వారా పాఠశాల మంజూరు చేసి, విద్యా వలంటీర్‌ను నియమించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం అణుకు గ్రామంలో మండల విద్యాశాఖాధికారులు టి.రామారావు, డి.జోషేల చేతుల మీదుగా పాఠశాల ప్రారంభించారు. గిరిజనులు వారిని గిరిజన సంప్రదాయంలో స్వాగతం పలికి పూల బొకేలు, ఆకు టోపీలతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ భవిష్యత్తులో పిల్లల సంఖ్య పెరిగితే పూర్తి స్థాయిలో పాఠశాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్‌ని, జిల్లా విద్యాశాఖాధికారులను కోరుతామని తెలిపారు. ఈ సందర్భంగా అణుకు గ్రామస్తులు, సీపీఎం నాయకులు పాఠశాల మంజూరు చేసిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తమ కష్టాలను, ఇబ్బందులను గుర్తించి రోడ్డు కూడా మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జి.డేవిడ్ రాజు, ఎం.సూరిబాబు, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో విద్యాశాఖాధికారులు, గిరిజనులు, స్థానిక నాయకులు

త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాల్లో శనివారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వెల్‌నెస్‌సెంటర్లు, డిజిటల్ లైబ్రరీల భవనాల నిర్మాణాల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మండలాల వారీగా సమీక్షించి, భవన నిర్మాణాల్లో జాప్యానికి గల కారణాలను తెలుసుకుని పరిష్కారాలను సూచించారు. ఈఈలు కె.శ్రీనివాసరావు, వి.నగేష్‌బాబు పాల్గొన్నారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

వచ్చే నెల 3న గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్‌సీ ఎగ్జామ్స్‌తో కలిసి సెప్టెంబర్ 3వ తేదీన ఉదయం 9 నుంచి 12.30 వరకు విశాఖలోని రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా గల డా.బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెలిసిందే.

లెజండరీ ఫ్యాకల్టీతో..

ఈ అవగాహన సదస్సుకు రాష్ట్రంలోనే లెజండరీ ఫ్యాకల్టీలైన బి.కృష్ణారెడ్డి (పాలిటీ), అబ్దుల్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎండీ పాషా (ఎకానమీ), ప్రొ. చింతా గణేష్ (సోషియాలజీ), మట్టపల్లి రాఘవేంద్ర(కరెంట్‌అఫైర్స్), శంకర్ రెడ్డి(మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) లాంటి లెజండరీ ఫ్యాకల్టీలు హాజరుకానున్నారు. అవగాహన సదస్సుతో పాటు అదే రోజు టాలెంట్ టెస్ట్ నిర్వహించి జిల్లాలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నారు. గ్రూప్-2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ :
సెప్టెంబర్ 3, 2023 (ఆదివారం)

వేదిక:
డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్,
రామాటాకీస్ దరి రీజనల్
కంటి ఆస్పత్రి ఎదురుగా విశాఖపట్నం

సమయం :
ఉదయం 9 నుంచి 12.30 వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నెంబర్ 8985094499

క్లుప్తంగా

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, సెర్ప్ ఉద్యోగులు

ఎస్.రాయవరం: ప్రజలతోపాటు ఉద్యోగులను అన్ని విధాలా ఆదుకునేది సీఎం జగన్‌మోహన్ రెడ్డియే అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలోని కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద శనివారం సీఎం జగన్ చిత్రపటానికి ఎమ్మెల్యేతో కలిసి సెర్ప్ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. ఐకేపీలో సీసీలుగా పని చేస్తున్న 4,550 మందికి 23 శాతం పీఆర్సీని విడుదల చేశారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు చేస్తున్న రుణమాఫీపై విస్తృతంగా ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ కరుణానిధి, ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల సీసీలు పాల్గొన్నారు.

వినూత్న రీతిలో విద్యా బోధన



జంతు మాస్కులతో బోధన చేస్తున్న టీచర్లు

మాకవరపాలెం: మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వినూత్న రీతిలో బోధన సాగిస్తున్నారు. జాతి సంపద అయిన వన్య ప్రాణులను కాపాడుకోవాలని చెబుతూ.. ఇలా బోధిస్తున్నట్టు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. శనివారం పాఠశాల హెచ్ఎం కె.రాము, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులకు జంతువుల మాస్కులతో విద్యా బోధన చేశారు. జంతు సంపద, వాటి జీవన విధానం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విశేషంగా ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్



ధీరజ్ తన కెమెరాతో బంధించిన ఛాయాచిత్రాలు



ధీరజ్‌ను సత్కరిస్తున్న ఆర్డీవో జయరాం, సన్యాసిపాత్రుడు, పట్టణ ప్రముఖులు

నర్సీపట్నం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సీపట్నానికి చెందిన గాయకుడు మాస్టర్ ధీరజ్ స్వయంగా తీసిన ఛాయాచిత్రాల ప్రదర్శనను స్థానిక వాసవీ కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఫొటో ఎగ్జిబిషన్‌ను పలువురు ఆసక్తిగా తిలకించారు. తొలుత ఈ ఎగ్జిబిషన్‌ను ఆర్డీవో హెచ్.వి.జయరాం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నుంచి సింగర్ ధీరజ్ ప్రశంసలు పొందటం సామాన్య విషయం కాదన్నారు. సింగర్‌గా ఫొటోగ్రఫీలో రాణించడం అభినందనీయమన్నారు. వెయ్యి పదాలతో చెప్పలేని భావాన్ని ఒక్క చిత్రంలో చూపగలిగే ఘనత ఫొటోగ్రఫీకి ఉందన్నారు. ఆర్డీవో, పట్టణ ప్రముఖులు కర్రి రాంగోపాల్, వెలగా నారాయణరావు, లయన్స్ క్లబ్ గవర్నర్ అధికారి గోపాలరావు, బంగార్రాజు, డాక్టర్ సి.ఎస్.కుమార్ ధీరజ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధీరజ్ వందేమాతరం గీతాన్ని అద్భుతంగా ఆలపించారు.

భారతీయ సంగీతం ఎంతో వైవిధ్యమైనది



యోగా గురువు వబ్బలరెడ్డికి సన్మానం



బలాజ్స్ విరాగ్ ప్రదర్శన

- హంగరీ పఖ్వాజ్ విద్వాంసుడు బలాష్ విరాగ్
- ఘనంగా శ్రీ ప్రకాష్ వ్యవస్థాపక దినోత్సవం
- అలరించిన విద్యార్థుల పాటల పోటీ

పాయకరావుపేట : ఎన్నో రకాల సంగీతాలు వున్న భారతీయ సంగీతం వైవిధ్యమైనదని హంగరీకి చెందిన పఖ్వాజ్ విద్వాంసుడు బలాష్ విరాగ్ అన్నారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 47వ వ్యవస్థాపక దినోత్సవాల సందర్భంగా జరిగిన 'గాతా రహే మేరా దిల్' పాటల పోటీల ముగింపు కార్యక్రమానికి బలాష్ విరాగ్, టి.ఇ.రాణి న్యాయనిర్ణేతగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బలాష్ విరాగ్ మాట్లాడుతూ తాను భారతీయ సంగీతం పట్ల మక్కువ కలిగి పాత శైలి పఖ్వాజ్ సంగీతం మాధుర్యాన్ని, దాని ఉనికిని పరిరక్షించడానికి, రాబోయే తరాల వారికి దీని పట్ల మక్కువ కలిగేలా ప్రదర్శనలు ఇస్తున్నానని తెలిపారు. భారతీయ సంస్కృతిలో గురు శిష్య పరంపరకు తాను అధిక ప్రాధాన్యమిస్తానని, తాను ఈ రోజుకీ ప్రదర్శనల కంటే తన స్వీయ అభివృద్ధికి విలువనిస్తానని పేర్కొన్నారు. విద్యార్థులు సంగీత సాధన తమ దినచర్యలో భాగం చేసుకున్నప్పుడే ఉత్తమ ఫలితాలు అందుకోగలరని తెలిపారు. ఈ సందర్భంగా బలాష్ విరాగ్ పఖ్వాజ్ కచేరీ అలరించింది. శ్రీ ప్రకాష్ డిగ్రీ ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్. విభాగాలు రోటరాక్ట్ క్లబ్ విద్యార్థులు రక్తదానం చేసి 120 యూనిట్ల రక్తాన్ని రోటరీ బ్లడ్ బ్యాంకు కాకినాడ, మదర్ బ్లడ్ బ్యాంకు తుని వారికి అందజేశారు. అనంతరం అంతర్జాతీయ యోగా గురువు వబ్బలరెడ్డి దుర్గాప్రసాద్‌ని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ ఘనంగా సన్మానించారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి, సభ్యుడు సోనివుడ్ పాల్గొన్నారు.

సుజల స్రవంతి పూర్తి చేస్తేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనకాపల్లి రూరల్/నర్సీపట్నం: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయితేనే అభివృద్ధి సాధ్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సు యాత్ర శనివారం అనకాపల్లి చేరుకుంది. పట్టణంలోని రోటరీ కల్యాణమండపంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు సాధన కోసం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తరాంధ్రకు జీవనాడి లాంటి సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయితే సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల జనాభాకు తాగునీరు, పరిశ్రమలకు 5.34 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. అగ్రి గోల్డ్ బాధితులు తమ సమస్య పరిష్కరించేలా చూడాలని కోరుతూ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్సన్‌బాబు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమల, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నర్సీపట్నంలో టిడ్కో గృహాలను సందర్శించారు. ప్రభుత్వం వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

శరవేగంగా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి నాగేశ్వరరావు



పైలట్ ప్రాజెక్టు కోసం తాండవ నదీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి నాగేశ్వరరావు డీఈ ప్రభాకర్‌రావు

నాతవరం: జిల్లాలో తాగునీటి సౌకర్యం కల్పనతో పాటు నీటి ఎద్దడి నివారణకు శరవేగంగా పనులు నిర్వహిస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి బి.వి.నాగేశ్వరరావు తెలిపారు. రూ.720.73 కోట్లతో 2,163 పనులు చేపట్టినట్టు ఆయన చెప్పారు. జగనన్న లేఅవుట్లలో చేపట్టిన తాగునీటి సౌకర్యం పనులతో పాటు పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు తాండవ నది పరిసర ప్రాంతాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు 469 పనులు పూర్తి చేశామని, వీటికి రూ.135.92 కోట్లు చెల్లించామని తెలిపారు. ప్రస్తుతం 620 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. 1074 పనులు టెండర్ దశలో ఉన్నాయని చెప్పారు.

మార్చి నాటికి జల్‌జీవన్ పనులు పూర్తి

4,18,167 ఇళ్లకు జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.172.33 కోట్లతో కుళాయిలు వేస్తున్నట్టు ఆయన తెలిపారు.ఇంతవరకు 2,54,227 ఇళ్లకు కుళాయిలు వేశామని, మిగిలినవి వచ్చేమార్చినాటికి పూర్తి చేస్తామని చెప్పారు.జగనన్న లేఅవుట్లలో మొదట రూ.21కోట్లతో తాత్కాలిక పనులు చేశామన్నారు. రూ.37 కోట్లతో ప్రస్తుతం శాశ్వత పనులు, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టినట్టు చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో చేపట్టిన 593 పనులకు గాను 147 పనులు పూర్తి చేశామని వాటికి రూ.21కోట్లు చెల్లింపులు చేశామన్నారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నట్టు ఆయన చెప్పారు. చమ్మచింత వద్ద తాండవ నదిలో రూ.7కోట్లతో పైలెట్ ప్రాజెక్టు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా మాధవనగరం, తాండవ గంటావారి కొత్తగూడెం, తాళ్లపాలెం, ఉటమల్ల వల్సంపేట, ఎ.కె.అగ్రహారం, కొత్త ఎల్లవరం, మోక్లాంగులపాలెం, మర్రిపాలెం, రెల్లి కాలనీ, వెన్నలపాలెం గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందిస్తామన్నారు.ఈకార్యక్రమంలో నర్సీపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.ప్రభాకరరావు జేఈ రాజేష్, పెదగొలుగొండపేట ఎంపీటీసీ సభ్యులు తమరాన సత్యనారాయణ, వర్కు ఇన్‌స్పెక్టరు రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కీచక తండ్రిని శిక్షించాలి



నిరసన తెలియజేస్తున్న ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు

అనకాపల్లి రూరల్: కన్న కూతురుపై లైంగిక దాడికి పాల్పడడమే కాకుండా భార్య, కుమార్తెపై హత్యాయత్నం చేసిన మానవమృగాన్ని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. అనకాపల్లి సీపీఐ కార్యాలయంలో శనివారం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. త్వరితగతిన కేసు విచారణ పూర్తయ్యేలా జిల్లా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి. మాణిక్యం,జిల్లా ఉపాధ్యక్షురాలు కె.వి. సూర్యప్రభ,జిల్లా సంయుక్త కార్యదర్శి డి.వరలక్ష్మి,జిల్లా కమిటీ సభ్యులు సుభాషిణి, జి.లక్ష్మి,ఆర్ లక్ష్మి,సీహెచ్ మంగ పాల్గొన్నారు.

నేడు వ్యాస రచన పోటీలు

అనకాపల్లిటౌన్: తెలుగుభాషా పరిరక్షణ సమితి, రాంభీఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో మహాభారతంపై ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు పరిరక్షణ సమితి సభ్యులు శనివారం తెలిపారు. 27న అదే కళాశాలలో వక్తృత్వం పోటీలు జరుగుతాయని, విజేతలకు 28న వివేకానందఫంక్షన్ హాలులో బహుమతులు అందజేస్తామని వారు చెప్పారు.

ఉపాధ్యాయుల ఆందోళన



డీఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. ప్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు నేతృత్వం వహించిన చైర్మన్ గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ బదిలీలు జరిగి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఆ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ వై సుధాకరరావు,కో చైర్మన్ కె.సాయి ప్రసాద్,డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్.సన్యాసినాయుడు,కోశాధికారి కె.పరదేశి,సెక్రటరీ సీహెచ్ నాగేశ్వరరావు,కార్యవర్గ సభ్యులు వి.శ్రీలక్ష్మి,ఎం.శ్రీను, ఎస్.వి. సూర్య,సీనియర్ నాయకులు రమేష్‌రావు, మధు,అచంట రవి,పొలిమేర చంద్రరావు,వేణుగోపాల్,ఎల్లయ్య బాబు,నూకేష్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 93 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,210	4,570
రెండో రకం	4,090	4,090
మూడోరకం	4,050	4,070

అనకాపల్లి సినిమాలు

బేబి : రాజా
పిజ్జా : సత్యనారాయణ స్క్రీన్-1
డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా
: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్ : షిర్డిసాయి
భోళాశంకర్ : పర్తిసాయి
భోళాశంకర్ : వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్ : శ్రీసత్య
బ్రో :రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బి పాజిటివ్-8 యూనిట్లు, ఒ పాజిటివ్ 13 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 377 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ను సంప్రదించవచ్చు.

విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు



కళాశాల విద్యార్థులు

అనకాపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి గంగరాజు, మూడో అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శివ కిరణ్ తెలిపారు. స్థానిక దాడివీరునాయుడు డిగ్రీ కళాశాలలో మండల న్యాయసేవ సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉండడం వల్ల విద్యార్థుల్లో సత్‌ప్రవర్తన అలవడడంతో పాటు సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. నేరం చేసినా, నేరం చేసేందుకు సహాయపడినా శిక్ష తప్పదన్నారు. రాజ్యాంగంపట్ల అందరూ అవగాహన పెంచుకోవాలని, హక్కులతోపాటు విధులను తెలుకోవాలని సూచించారు.తల్లిదండ్రులను ప్రేమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్, కోర్టు సిబ్బంది జగదీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణానికి హాని లేకుండా సిమెంట్ ఉత్పత్తి



మాట్లాడుతున్న జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంతరెడ్డి

కశింకోట: పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకుని సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నామని సాగర్ సిమెంట్ పరిశ్రమ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. శ్రీకాంతరెడ్డి తెలిపారు. మండలంలోని బయ్యవరంలో ఉన్న సాగర్ సిమెంట్ పరిశ్రమలో రాష్ట్రంలో తొలిసారిగా ఇన్‌స్టా పవర్ సిమెంట్ నూతన ఉత్పత్తిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదట తమిళనాడులో ఇన్‌స్టా పవర్ సిమెంట్‌ను ఏడాది క్రితం ఉత్పత్తి ప్రారంభించామని, అది విజయవంతమైందన్నారు.దీంతో ఇక్కడ రాష్ట్రంలో తొలిసారిగా ఉత్పత్తి ప్రారంభించామన్నారు. దీనివల్ల పర్యావరణానికి ప్రమాదం లేకుండా సిమెంట్ ఉత్పత్తి కావడంతోపాటు శ్లాబ్‌లు,కాంక్రీట్ స్తంభాల నిర్మాణంలో త్వరగా ఆరుదలతో గట్టి పడుతుందన్నారు. దీనిలో వినియోగించే లైం స్టోన్‌లో కార్బన్‌డై ఆక్సైడ్‌ను తొలగించి తయారు చేయడం వల్ల సిమెంట్ పర్యావరణానికి కూడా హానికరం కాదన్నారు. రోబో సహాయంతో సిమెంట్ నాణ్యత పరిశీలించే యూనిట్‌ను ఇక్కడ పరిశ్రమలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. పరిశ్రమలో తయారైన సిమెంట్ తరలింపునకు దక్షిణాదిలోనే తొలిసారిగా ఎలక్ట్రికల్ ట్రక్కులను వినియోగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూపు ప్రెసిడెంట్ కె.గణేష్, సీనియర్ జనరల్ మేనేజర్ (వర్క్స్) కె.శ్రీనివాసరావు, సీఎంవో రాజేష్‌సింగ్, పరిశ్రమ మేనేజర్ పి.వి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కశింకోట: విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించడానికి వినియోగదారులు ఈస్టన్ పవర్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏఈపీడీసీఎల్ స్థానిక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఎస్. రామకృష్ణ కోరారు. శనివారం రాత్రి ఆయన విలేరులతో మాట్లాడుతూ www.apeasternpower.com వెబ్‌సైట్ ద్వారా పేబిల్ ఆప్షన్ ఎంపిక చేసుకుని ఆన్‌లైన్‌లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. విద్యుత్ కనెక్షన్‌కు అనుసంధానం చేయడానికి తమ ఆధార్ నంబర్ నఖలును తమ విద్యుత్ సిబ్బందికి అందజేయాలని కోరారు. సందేహాలుంటే 1912 నంబర్‌కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని కోరారు.

సకాలంలో టీకాలు వేయాలి



దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారితో మాట్లాడుతున్న డాక్టర్ మురళీధర్

రాంబిల్లి : జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.మురళీధర్ శనివారం దిమిలి పీహెచ్‌సీని సందర్శించారు. దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.వెంకటేష్‌తో టీకాల ప్రక్రియపై చర్చించారు. దిమిలి పీహెచ్‌సీలో ప్రసవములు జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు వైద్య సిబ్బంది తగిన అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.ఎస్.వి.ఎన్ రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ ధనరాజ్, ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

అంతిమయాత్రకు వాహన సదుపాయం



కొత్తగా వినియోగంలోకి తెచ్చిన అంతిమ యాత్ర రథం

యలమంచిలి : పట్టణ ప్రజలకు అంతిమ యాత్ర కష్టాలు తీరనున్నాయి. పట్టణ పరిధిలో మరణించిన వారి దహన సంస్కారాల నిమిత్తం మహాప్రస్థానం పేరుతో కొత్త వాహనాన్ని పురపాలక సంఘం అధికారులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇప్పటివరకు పట్టణంలో దహన సంస్కారాల కోసం ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని మృతదేహాల దహన సంస్కారాలకు శ్మశానవాటిక వరకు మోసుకెళ్లేందుకు మనుషులు దొరకని పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రజల అవసరాల దృష్ట్యా మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పాలక వర్గ సభ్యులు పట్టణానికి చెందిన కొందరి ఆర్థిక సహాయంతో కొత్తగా డిజైన్ చేయబడిన అంతిమయాత్ర వాహనాన్ని శనివారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్టు ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య తెలిపారు. వాహనంలో అంతిమయాత్ర అవసరాలకు సరిపోయేలా ఏర్పాట్లు చేశారు. ఈ వాహనం అవసరమైన వాళ్లు రూ.1000 రుసుము చెల్లించి వినియోగించవచ్చు అని ఆయన తెలిపారు. వాహనం అవసరమైనవాళ్లు పురపాలక సంఘం శానిటరి ఇన్‌స్పెక్టర్ ఫోన్ నెంబరు.9618496437 సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు.

పక్కాగా ఫ్యామిలీ డాక్టర్ సేవలు

డీఎంహెచ్‌వో హేమంత్



గునిపూడిలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

నక్కపల్లి : మండలంలో ఫ్యామిలి డాక్టర్ వైద్య సేవలు పక్కాగా అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హేమంత్ అన్నారు. శనివారం ఆయన గొడిచర్ల పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఓపి వైద్యసేవలను, ఫార్మసీ విభాగాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలను గురించి వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. గునిపూడిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ అనే విధానాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గ్రామంలోకి డాక్టర్లు వచ్చి వైద్య సేవలు అందించడం, పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వయోభారంతో బాధపడేవారు, మంచాలకే పరిమితమైన వారికి ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వైద్య బృందంతో పాటు, అన్నిరకాల పరీక్షలు చేసేందుకు అంబులెన్స్‌లు సైతం అందుబాటులో ఉంటున్నాయన్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ప్రజా వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రోగులకు అందుబాటులో ఉంటూ సరైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. డ్యూటీల ప్రకారం సిబ్బంది ఆస్పత్రిలో ఉండాలన్నారు. రోగుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు.

83 వార్డులో దోమల మందు పిచికారీ



దోమలమందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

అనకాపల్లిటౌన్: దోమ కాటుకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ మలేరియా విభాగం అధికారి సీహెచ్.గణేష్ అన్నారు. పట్టణంలో 83వ వార్డు పరిధిలో శనివారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న సమయంలో వివిధ విషజ్వరాలు ప్రబలే అవకాశముందని, వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల అభివృద్ధి చెందే ప్రాంతాల్లో నీటినిల్వలను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రోయిన్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

మాకవరపాలెం: గ్రోయిన్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ రైతులతో కలిసి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని తూటిపాల, తాడపాల గ్రామాల పరిధిలోని సాగునీరు అందించే గ్రోయిన్ ఐదేళ్ల క్రితం తుపాను వర్షాలకు దెబ్బతింది. ఈ నేపథ్యంలో ఆయకట్టు భూములకు నీరు అందడం లేదు. దీంతో శనివారం ఈ రెండు గ్రామాల రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఎమ్మెల్యే గణేష్ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. రూ.30 లక్షలు మంజూరు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయిస్తామనిహామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, తూటిపాల సర్పంచ్ గవిరెడ్డి ప్రసాద్, మాజీ సర్పంచ్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి పీఎం సహాయనిధి



బాధితురాలి కుటుంబసభ్యునికి చెక్కు అందజేస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: క్యాన్సర్ బాధితురాలికి పీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును ఎంపీ బి.వి.సత్యవతి శనివారం అందజేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని గొలగాం గ్రామానికి చెందిన సాలుపురెడ్డి రవణమ్మకు చికిత్స నిమిత్తం రూ.3 లక్షల చెక్కును తన కార్యాలయంలో అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

దేవరాపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వి. రవీంద్రనాథ్ తెలిపారు. కాశీపురం పంచాయతీ శివారు చంద్రయ్యపేటలో జగనన్న కాలనీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, బిల్లులు సైతం సకాలంలో మంజూరు చేస్తున్నామన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని కాశీపురం సచివాలయ భవన నిర్మాణాన్ని, ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలించారు. తహసీల్దార్ ఎం. లక్ష్మి, సూపరింటెండెంట్ జి.వి.రమణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గోవింద,పంచాయతీసెక్రటరీఆర్.సత్యవతిపాల్గొ న్నారు.

మాడుగుల: జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జి.ప్రభాకరరావు అన్నారు. శనివారం ఆయన ముకుందపురంలో జగనన్న లేఅవుట్లు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో సకల సదుపాయాలు కల్పిస్తున్నామని, ఇంకా ఇల్లు నిర్మాణం ప్రారంభించకపోతే అర్హత కలిగిన వేరే లబ్ధిదారులకు లేఅవుట్ కేటాయిస్తామన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో అధికారులుతో సమావేశమయ్యారు. ఓటరు సర్వే వేగవంతంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. ఎంపీడీవో మీనాకుమారి, తహసీల్దారు పీవీరత్నం , ఎన్నికల డీటీ పూర్ణయ పాల్గొన్నారు.

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రోలుగుంట: శ్రీకాకుళం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఈ నెల 13న నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. ఎస్.కార్తీక్, జి.మోహన్ అర్జున్, ఎస్.కల్యాణ్‌రాజ్ సిల్వర్ మెడల్స్, ఎ.కుమార్‌నాయుడు, కె.వంశీ, పి.అరుణ్‌కుమార్, కె.సాయిబాబు, బి.లోహిత, బి.గుణశేఖర్, తదితరులు బ్రాంజి మెడల్స్ సాధించారు. వీరితోపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పీఈటీ ఎన్. గోవింద్‌ను హెచ్‌ఎం వరప్రసాద్, ఎస్.ఎం.సి. చైర్మన్ బండారు రామకృష్ణ, ఉపాధ్యాయులు కిరణ్, నాని, సతీష్ తదితరులు శనివారం పాఠశాల ఆవరణలో అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం సాధించాలి



విద్యశ్రీకి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య, చిత్రంలో కళాశాల ప్రిన్సిపాల్ దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం పొందించుకుని పోటీప్రపంచంలో ముందుకు సాగాలని జేఎన్‌టీయూ విజయనగరం ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక 'డైట్' కళాశాలలో శనివారం 14వ స్నాతకోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా బీటెక్ విద్యార్థులకు ఆయన పట్టాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలన్నారు. కళాశాల బెస్ట్ ఔట్‌గోయింగ్ సాధించిన నాగం విద్యశ్రీకి 250 వెండిపతకం, బ్రాంచ్ టాపర్లుగా నిలిచిన వారికి 50 గ్రాముల వెండి పతకాలతోపాటుప్రశంసాపత్రాలను వెంకటసుబ్బయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సుంకర చినఅప్పలనాయుడు, ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతిబాపూలే బీసీ అసోసియేషన్ కార్యవర్గాల ఎన్నిక



జిల్లా అధ్యక్షుడు పండూరి గణేష్‌బాబును సత్కరిస్తున్న రాష్ట్ర ఇన్‌చార్జి ఆడారి కుమారస్వామి

అనకాపల్లి టౌన్: జ్యోతిబాపూలే బీసీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పండూరి గణేష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక హోటల్‌లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.సోమశేఖర్ పట్నాయక్, ఉపాధ్యక్షుడిగా ఆళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కొమ్మోజు రమేష్, కార్యదర్శులుగా మహేష్, నాని, సహాయ కార్యదర్శులుగా ఎస్.వి.ఎస్.పట్నాయక్, దాడి జగ్గారావు, కోశాధికారిగా బొడ్డేడ ఈశ్వర్, ఉప కోశాధికారి బి.భాస్కర్‌రావుతోపాటు మరో పది మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఉత్తరాంధ్ర జిల్లా కమిటీ...

జ్యోతిబాపూలే బీసీ అసోసియేషన్ ఉత్తరాంధ్ర అధ్యక్షుడిగా పీలా నీలతిలక్, ప్రధాన కార్యదర్శిగా రౌతు శంకరరావు, కోశాధికారిగా యండకుర్తి అప్పలరాజు, ఉప కోశాధికారిగా దాడి బుజ్జి ఎన్నికయ్యారు. మిగిలిన కమిటీ సభ్యులను త్వరలో ప్రకటించనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి ఆడారి కుమార్‌స్వామి అన్నారు. ఈ రెండు కమిటీల పదవీ కాలం మూడు సంవత్సరాలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు బొడ్డేడ అప్పారావు, కొణతాల రమణఅప్పారావు, డీవీవీ జగన్నాథరావు, కొణతాల హరనాథ్‌బాబు, బొడ్డేడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సొంతిల్లే లక్ష్యం



సుంకపూరులోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

కోటవురట్ల : సుంకపూరులోని వైఎస్సార్ జగనన్న కాలనీలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఉదయశ్రీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఆమె మాట్లాడుతూ పేదలకు సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు కూడా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. బిల్లులు సకాలంలో మంజూరవుతున్నాయని, మెటీరియల్ కూడా అందుబాటులో ఉందన్నారు. అనంతరం ఆర్బీకే, నిర్మాణంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాలపై సిబ్బందితో సమీక్ష చేశారు. ఏవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



మునగపాకలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. మునగపాక, ఒంపోలు, టి.సిరసపల్లి తదితర ప్రాంతాల్లోని జగనన్న ఇళ్ల కాలనీలను ఆమె హౌసింగ్ డేలో భాగంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలతో పాటు స్థలాలు కేటాయిస్తామన్నారు. మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డు పనులు ప్రారంభం



పాయకరావుపేట మెయిన్‌రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

పాయకరావుపేట : పట్టణంలో గల మెయిన్‌రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. గౌతమ్ థియేటర్ సెంటర్ నుండి బైపాస్ సెంటర్ వరకు 1.9 కిలోమీటర్లు పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. వీఎంఆర్‌డీఏ నిధులతో కోటి 95 లక్షలు రూపాయలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డు విస్తరణకు చిన్న వర్తకుల సంఘం కోర్టును ఆశ్రయించడం వల్ల విస్తరణ లేకుండా, యథాప్రకారం రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని వీఎంఆర్‌డీఏ అధికారులు తెలియజేశారు.

31 వరకే ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు

ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ చిట్టినాయుడు



చింతలూరులో ముద్ద చర్మవ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

మాడుగుల: మండలంలో ఈ నెల 31వ తేదీ వరకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తామని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. మండలంలోని వీరవిల్లి అగ్రహారం, చింతలూరు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలుతాయన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ అందిస్తున్న సేవలు గురించి రైతులకు వివరించారు. పశువైద్య సహాయకులు ఆశ, మోదినాయుడు పాల్గొన్నారు.

కె.నాయుడుపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం

రోలుగుంట: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం కె.నాయుడుపాలెంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గుములూరి బాబులు ప్రారంభించగా, 60 పశువులకు రోలుగుంట పశు వైద్యాధికారి నూకేశ్వరరావు చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీనికి ముందు సీజనల్‌గా పశువులకు సంక్రమించే ముద్ద చర్మవ్యాధి, గొంతు వాపు వ్యాధి తదితర రోగ లక్షణాలు, నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఇక్కడ గోపాలమిత్ర సత్యనారాయణ, గ్రామస్థాయి పశువైద్య సహాయకులు వల్లిక యశోద, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొని సేవలందించారు.